క్లుప్తంగా

ఎంపీ ఎంవీవీకి అభినందనలు



ఎంవీవీతో అనూష పట్నాయక్, తదితరులు

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజక వర్గ సమన్వయకర్తగా నియమకమైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను సోమవారం రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పటాన్నయక్, రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.కె.మహంతి, కరణం కృష్ణం, శ్రీధర్, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీని ఘనంగా సన్మానించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాక్‌లో పాల్గొన్న ఉద్యోగులు

బీచ్ రోడ్డు: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని విశాఖపట్నం పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్‌బాబు అన్నారు. జాతీయ క్రీడా వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆదేశాల మేరకు సోమవారం 5కే వాక్‌ను సాగరతీరంలో నిర్వహించారు. ఈ వాక్‌ను ప్రారంభించిన ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న రోటరీ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్

మద్దిలపాలెం : కేఆర్‌ఎం కాలనీలోని జీవీఆర్ రెసిడెన్సీ ఆధ్వర్యంలో సోమవారం 12 మంది మహిళలకు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆసరా చారిటబుల్, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ సంయుక్తంగా గుర్తించిన లబ్ధిదారులకు ఈ మెషిన్‌లు అందజేశారు. ఆసరా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు రమాప్రభ, రోటరీ క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి సత్కారం



కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖుబాను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబాను నగర బీజేపీ నాయకులు సోమవారం సత్కరించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళాలో భాగంగా విశాఖలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, జిల్లా కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం నేడు

మద్దిలపాలెం: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం మద్దిలపాలెం కూడలిలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నామని తెలుగుదండు ప్రతినిధి సూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తెలుగు తల్లికి నీరాజనంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తెలుగు భాషాభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

పేదల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలు

- ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 13వ వార్డులో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

ఆరిలోవ: పేద ప్రజల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో ఎంపీ నలభై గజాలు, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీల్లో ఇంటింటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి నీరాజనం పట్టారు. గృహిణులు, వృద్ధులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ద్వారా ఏ విధంగా లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందుకుని ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోరుకుంటున్నారన్నారు. పేదవాడి కళ్లలో చిరునవ్వు చూడాలని సీఎం ఆశిస్తున్నారన్నారు. మేయర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాల ద్వారా పేద విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశం కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ బి.అప్పలకొండ, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపా జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, అల్లంపల్లి రాజబాబు, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, పతివాడ వెంకటలక్ష్మి, శిరీష, వీర్రాజు, శ్రీను, బాబూరావు, గోవింద్, శంకరరావు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలతో ముద్రించిన కర పత్రం అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని, కార్పొరేటర్ కెల్ల

రూ.1.29 లక్షలు లబ్ధి పొందా..



సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా లభించింది. నాకు వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా వస్తోంది. వీటి ద్వారా రూ.1,29,512 లబ్ధి కలిగింది.

– రాయవరపు రామయ్యమ్మ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ.

ఆర్థిక అవసరాలు తీరాయి..



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల ఆర్థిక అవసరాలు తీరుతున్నాయి. మా కుటుంబానికి జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ వాహన మిత్ర లభిస్తున్నాయి. వీటి ద్వారా రూ.1,39,195 పొందాం. చాలా సంతోషంగా ఉంది.

– తమ్మిరెడ్డి దమయంతి, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ,

విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం

- ఆ విధంగా సిలబస్ రూపకల్పన అవసరం
- ఆధునిక సాంకేతికత విద్యార్థులకు చేరువ చేయాలి
- బీవోఎస్ సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన వార్షిక బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలు, మార్పులను రాష్ట్ర యువతకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా పని చేస్తూ అన్ని కోర్సుల్లో ఐటీ సబ్జెక్టులను మిళితం చేయాలన్నారు. డేటా సైన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. ప్రోగ్రెసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతులకు దిశానిర్దేశం చేసారని గుర్తు చేశారు. అలాగే ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశ పెట్టాలని సూచించారన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం దీంతో సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతి సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించేలా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు. పేటెంట్ల సాధన, నూతన ఉత్పత్తుల తయారీతో పాటు మరింత ప్రగతిని సాధించే దిశగా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్య భూమిక పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యల నుంచి ఉపశమనం కలిగించే విధంగా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానం-2020లో సూచించిన విధంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచుతూ సిలబస్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఎస్.కె.భట్టి పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి ఎంపీ నిధులు

18వ వార్డు పర్యటనలో ఎంపీ ఎంవీవీ హామీ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు అప్పుఘర్‌లోని శ్మశానవాటిక అభివృద్ధికి తన ఎంపీ లాండ్స్ నుంచి నిధులు అందజేస్తానని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ హామీ ఇచ్చారు. 18వ వార్డు పర్యటనలో భాగంగా ఆయన సోమవారం అప్పుఘర్ దరి శ్మశానవాటిక పరిసరాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వార్డుల ప్రజలు వినియోగించుకుంటున్న ఈ శ్మశానవాటికలోని సమస్యలను స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అక్కడి సదుపాయాలను పరిశీలించిన ఎంవీవీ తన ఎంపీ లాండ్స్ నుంచి శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ హామీతో దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం లభించనుందని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణులతో కలిసి శ్మశాన వాటికను సందర్శించిన ఎంపీ ఎంవీవీ

ఏయూ సమాచారమ్

నేడు ప్రత్యేక ప్రసంగం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక ప్రసంగం కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో విద్యార్థులను ద్దేశించి సెంట్రల్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్(జీవోసీ-ఇన్-సీ) లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్.రాజ సుబ్రమణి 'అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ'అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆయన పాల్గొంటారని తెలిపారు. ముందుగా లెఫ్టినెంట్ కల్నల్ సుబ్రమణి ఏయూలో పరిపాలన భవనంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కొద్ది సేపు సమావేశమవుతారు.

ముగిసిన ఐపీఆర్ ఆన్‌లైన్ కోర్సు



ముగింపు సదస్సులో ప్రసంగిస్తున్న ఆచార్య పురుషోత్తం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ముగిసింది. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులకు మేధోహక్కులు, పేటెంట్‌లపై విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 210 మంది విద్యార్థులకు ఐపీఆర్ కేంద్రం చైర్ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తం దిశానిర్దేశం చేశారు. మేధోహక్కులను వాణిజ్య ఉపయుక్తంగా మలచుకునే విధానాలను వివరించారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



బస్సు దిగి జీవీఎంసీకి నడిచి వస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయినందున, వాటి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవం

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్, వైదిక విపంచి, శ్రీవారి సేవ టీమ్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన వేడుకలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పవిత్రోత్సవ అంకురార్పణ, సహస్రనామార్చనతో పాటు స్వామికి దశ హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కిరణ్మయి నృత్యాలయం బృందం సంప్రదాయ నృత్యాలతో అలరించింది. ఈ సందర్భంగా విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్ ప్రతినిధి హిమాంశుప్రసాద్ మాట్లాడుతూ తిరుపతిలో జరుగుతున్న తిరుమల పవిత్రోత్సవాలను పురస్కరించుకుని విశాఖలోనూ శ్రీవారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం శ్రావణం నక్షత్రం పురస్కరించుకుని శ్రీవారికి పవిత్ర సమర్పణ, వస్త్ర సమర్పణ, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



శ్రీవారి సన్నిధిలో కళాకారిణుల నృత్య ప్రదర్శన

'బషీర్‌బాగ్ పాపం చంద్రబాబుదే'



ఆరిలోవలో విద్యుత్ అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో సీపీఎం నాయకులు



18వ వార్డులో అమర వీరులకు నివాళులర్పిస్తున్న కార్మికులు

ఆరిలోవ: ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో నారా చంద్రబాబు పాలన నిరంకుశమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ తెలిపారు. విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ సోమవారం తోటగరువు సమీపం బీఎన్ఆర్ నగర్‌లో సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు నిర్వహించారు. అమర వీరుల చిత్ర పటాలకు ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000, ఆగస్టు 28న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపారన్నారు. ఈ పెంపును నిరసిస్తూ అప్పట్లో చేపట్టిన ఉద్యమంలో పాల్గొన్న వామపక్షాల నాయకులపై నిర్దాక్షిణ్యంగా గుర్రాలతో తొక్కించి, రోడ్డు మీద ముళ్ల కంచె వేసి వాటర్ క్యాన్లు, భాష్పాయువు ప్రయోగించారని గుర్తు చేశారు. ఈ తొక్కిసలాటలో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్దన్‌రెడ్డి అనే ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అందుకే 2004లో ప్రజలు బాబును దారుణంగా ఓడించి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అలాగే ప్రస్తుతం పెంచిన చార్జీలను కూడా వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.కుమార్, నాగరాజు, రమణ, సూర్యనారాయణ, నగేష్ పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు ఘన నివాళి

ఎంవీపీకాలనీ: విద్యుత్ భారానికి నిరసనగా ఆగస్టు 28, 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన వారికి సీపీఎం మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎంవీపీ కాలనీలోని 18వ వార్డు జీవీఎంసీ వార్డు కార్యాలయం ఆవరణంలో సోమవారం అమర వీరుల చిత్రపటాలకు జోన్ కార్యదర్శి కృష్ణారావు, సీఐటీయూ జేఆర్ నాయుడు, ఎన్వీ రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సమయ పాలన తప్పనిసరి

బీచ్ రోడ్డు: విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుని, సమయపాలన పాటించాలని స్పెషల్ ఎకనామిక్ జోన్ డిప్యూటీ జాయింట్ కమిషనర్ కె.రోషిని అన్నారు. సోమవారం ఆల్ సెయింట్స్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా నగరంలో విశేష సేవలందిస్తున్న ఆల్ సెయింట్స్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికబద్ధంగా చదువుతూ ఉన్న శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వి.కమలాదేవిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ విశాఖపట్నం ఎయిర్‌పోర్టు చేబ్రోలు కీర్తి కిరీటి, చైర్మన్ వి.డి.రవీంద్ర సుందర్, ప్రిన్సిపాల్ ఎస్ మేర్సీ ఎస్తేర్, తదితరులు పాల్గొన్నారు.



కరస్పాండెంట్ కమలాదేవిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కృష్ణా డిగ్రీ కళాశాలలో వసతులు కల్పించాలి

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీస వసతులు కల్పించాలని ఏఐడీఎస్‌వో నగర కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కళాశాల క్యాంటీన్‌లో పరిశుభ్రత లోపించిందని సంతోష్ తెలిపారు. తాగునీటి సదుపాయం లేదన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



పైనాపిల్ కాలనీలో అనాథ శవాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళ్తున్న కానిస్టేబుల్ సురేష్, స్థానికులు

ఆరిలోవ: కొద్ది రోజుల కిందట ఎక్కడి నుంచో వచ్చి పైనాపిల్ కాలనీ ప్రాంతంలో యాచన చేస్తూ 62 ఏళ్ల ఓ వృద్ధురాలు కాలం వెళ్లదీస్తూ ఉండేది. ఆమె సోమవారం ఓ షాపు ముందు స్పృహ తప్పిపడిపోయింది. కొంత సేపటికి ప్రాణాలు విడిచింది. దీంతో స్థానికులు ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సోమశేఖర్ సూచనతో కానిస్టేబుల్ సురేష్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో ఆ మృతదేహాన్ని సమీపంలో శ్మశానానికి తరలించారు. అన్నీ తామై ఖననం చేశారు. ఆమె చిరునామా తెలియకపోవడంతో గుర్తు తెలియని వృద్ధురాలి మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇన్స్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజనీరింగ్-మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్-డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇన్స్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లమాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇన్స్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతోపాటే నైట్ అలవెన్స్

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, రాష్ట్ర మెయింటెనెన్స్ కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శి కే శ్రీనివాసరావు, డీఎస్ఎన్ మూర్తి, జోనల్ నాయకులు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు

నేడు అవగాహన సదస్సు

కంచరపాలెం : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు తయారీ, సేవా పరమైన యూనిట్లు ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఐటీఐఎటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సదస్సు ఉందన్నారు. అభ్యర్థులు kviconine.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకొని సదస్సు రావాలని కోరారు.

నేత్రదాన ఆవశ్యకతపై అవగాహన

సీతంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో 'నేత్రదానం-ఆవశ్యకత'పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నేత్ర వైద్యశాఖ సిబ్బంది, ఐ డొనేషన్ కౌన్సిలర్లు 9, 10 తరగతి విద్యార్థులకు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. అనంతరం కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీ నరస, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, భవిత టీచర్ జగదాంబ, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, టెక్నీషియన్ హుస్సేన్ పాల్గొన్నారు.



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

నేడు మెగా రక్తదాన శిబిరం

ఎంవీపీ కాలనీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంకోఫిట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్‌ను నగర డీసీపీ విద్యాసాగర్ నాయుడు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మహేష్, టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఏయూలోని జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. నగరంలోని వివిధ జిమ్‌లకు చెందిన యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత ఈ శిబిరంలో పాల్గొనాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ విద్యాసాగర్‌నాయుడు